నాణ్యమైన వైద్యం అందించడమే ధ్యేయం

- ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు
- జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాల ప్రారంభం



పెనమలూరులో మందులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శివయ్య, ఎంపీడీఓ సునీతాశర్మ



గన్నవరంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



కంకిపాడులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

గన్నవరం: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ధ్యేయమని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు తెలిపారు. మండలంలోని చిన్నఆవుటపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొలుత శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గోగులమూడి విజయలక్ష్మితో కలిసి జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ప్రారంభించారు. అనంతరం పెద్దఆవుటపల్లి పీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణలో జరుగుతున్న సురక్ష శిబిరాన్ని పరిశీలించడంతో పాటు ప్రజలకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగించుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని కోరారు. వైద్యులు నాగజ్యోతి, పి.వంశీకృష్ణరాజు, ఎస్‌కే కరిముల్లా, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యం

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజారోగ్యం పరిరక్షించబడుతుందని తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య అన్నారు. పెనమలూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌తో పాటు ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే చేసి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఉచిత వైద్య పరీక్షలు చేసి, 250 రకాల మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని వైద్య సాయం పొందాలని సూచించారు. గ్రామాల్లో క్రమం తప్పకుండా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కంకిపాడు: ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసూజ సూచించారు. కంకిపాడు–3 సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరంలో వైద్య బృందం డాక్టర్ ఇమ్రాన్, డాక్టర్ నికిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్ కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. దృష్టిలోపాలు ఉన్న వారికి కళ్లజోళ్లు, అవసరమైతే శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీహెచ్ఈఓ కృష్ణారావు, శ్రీనివాసరావు, రాచమళ్ల శ్యాంప్రసాద్, సీహెచ్ఓ మంజు, ఏఎన్ఎంలు సుజాత, ప్రశాంతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం

ఉంగుటూరు: ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని వెల్దిపాడు గ్రామ సర్పంచ్ లాం నాగేశ్వరరావు అన్నారు. వెల్దిపాడు గ్రామ సచివాలయం వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ వైద్య శిబిరంలో 413 మందికి వైద్య పరీక్షలు చేశామని డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిరావు, తుట్టగుంట, వెన్నూతల, నాగవరప్పాడు సర్పంచ్‌లు బి.కృష్ణారెడ్డి, టి.వెంకటరామ్మోహన్‌రావు, షేక్ పెద నాగూర్, వైస్ ఎంపీపీ–2 కె.చంద్రశేఖర్ రావు, కార్యదర్శి సాయిబాబు, వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న కులగణన



పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో కులగణన వేగంగా కొనసాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 19 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయ పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, ఆదాయం నమోదు చేసి కులగణన చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న ప్రతి ఒక్కరి వివరాలు ఈ నెల 28 లోగా నమోదు చేయించుకోవాలని సచివాలయ సిబ్బంది కోరారు. మున్సిపాలిటీ పరిధిలో 48,032 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది.

2న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చే నెల 2వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ బి.భార్గవి తెలిపారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షిస్తామన్నారు. ఎంపీటీసీలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ఘనంగా గుణదల లూర్దు మాత వేడుకలు



పెనమలూరు: గుణదల లూర్దుమాత వంద వసంతాల వేడుకలు కానూరు మౌంట్‌కార్మెల్ పుణ్యక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుణదల పుణ్యక్షేత్రం నుంచి వచ్చిన గుణదల లూర్దుమాత స్వరూపాన్ని ఫాదర్ చలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో భక్తుల దీవెనల కోసం ప్రదర్శించారు. గంగూరు, పోరంకి, కామయ్యతోపు, కానూరు నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి లూర్దుమాతను ఆహ్వానించారు. ఫాదర్లు ప్రదీప్, దేవదానం, ఉపదేశకులు పాల్గొని దివ్యబలి పూజ జరిపారు.

మల్లవల్లి పారిశ్రామిక పార్క్‌లో టాటా స్టీల్ సర్వీస్ సెంటర్ ప్రారంభం నేడు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ మోడరన్ పారిశ్రామిక పార్క్‌లో ప్రతిష్టాత్మక టాటా స్టీల్ కంపెనీ ప్రపంచ శ్రేణి భవన నిర్మాణ సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు టాటా స్టీల్ వైస్ ప్రెసిడెంట్ ఆశిష్ అనుపమ్ చేతుల మీదుగా సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి జి.మహేష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మల్లవల్లి ఏపీఐఐసీ మోడరన్ పారిశ్రామిక పార్క్‌లోని స్మార్ట్ ఐరన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాంగణంలో టాటా స్టీల్ నిర్మాణ సర్వీస్ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వివాదాస్పద భూ వ్యవహారమే దాడికి కారణం !

గన్నవరం: గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై ఈ నెల 21న గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనకు సంబంధించి పోలీసులు విచారణను వేగవంతం చేశారు. రియల్ ఎస్టేట్ లావాదేవీలతోనే ఈ ఘటన జరిగినట్లుగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఓ వివాదస్పద భూమి విక్రయ డీల్ బెడిసికొట్టడంతో పక్కా స్కెచ్‌తో రంగబాబుపై దాడి చేసినట్లుగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అయితే ఎన్నికలు సమీపిస్తున్న వేళ జరిగిన ఈ దాడిని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై నెట్టే కుట్రలకు టీడీపీ తెరదీసింది. దీంతో ఈ ఘటనకు రాజకీయ రంగు పులుముకుంది. ఈ నేపథ్యంలో ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇప్పటికే నిందితులు ఉపయోగించిన రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు కాల్‌డేటా ఆధారంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తుండడంతో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.

ముఖ్యంగా గన్నవరం ప్రాంతంలో ఓ వివాదాస్పద భూమిని విక్రయించే విషయమై బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో రంగబాబు ఒప్పందం కుదురుకున్నట్లుగా తెలుస్తోంది. దీని నిమిత్తం రంగబాబుకు భారీ మొత్తంలో నగదు అందినట్లుగా సమాచారం. అయితే ఆ డీల్ ముందుకు సాగకపోవడంతో పాటు తీసుకున్న డబ్బు వెనక్కి ఇవ్వకపోవడం కారణంగా వీరి మధ్య వివాదాలు తలెత్తి చివరికి రంగబాబుపై దాడికి దారితీసినట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దాడికి పాల్పడిన వ్యక్తులతో పాటు ప్రధాన సూత్రదారులను పట్టుకుని పూర్తి వివరాలను వెల్లడించే దిశగా పోలీసులు విచారణ సాగిస్తున్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆసరాగా జగనన్న



ఉంగుటూరులో జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

- వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల
- మండలంలో 10,800 మందికి రూ.40 కోట్ల లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు

ఉంగుటూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీకి కట్టుబడి అక్క చెల్లెమ్మలకు నాలుగేళ్లుగా ప్రతి ఏటా వైఎస్సార్ ఆసరాతో అండగా నిలుస్తున్నారు. ఇప్పటికే మూడు విడతల రుణ మాఫీ చేసిన ప్రభుత్వం నాలుగో విడత నగదును అర్హులైన అక్క చెల్లెమ్మల ఖాతాల్లో మంగళవారం జమ చేశారు. కరోనా వంటి మహమ్మారి వ్యాప్తి వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సీఎం జగన్ అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నగదు జమ చేసి కష్ట సమయంలో వారికి అండగా నిలిచారు. 2019వ సంవత్సరానికి ముందు రుణాలు తీసుకున్న డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతలగా ఆయా సంఘాలకు నగదు చెల్లిస్తూ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది. ఇప్పటికే మండలంలో ఆసరా నాలుగు విడతల మొత్తం సొమ్ము రూ.40 కోట్లు సంఘాల్లోని 10,800 మంది మహిళలకు చెల్లించారు.

సీఎం జగన్ అండగా నిలిచారు..



రాష్ట్రంలో అక్క చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. గత టీడీపీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని మహిళలను మోసం చేశారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడతతో కలిపి రూ.30 వేలకు పైగా లబ్ధి పొందాను. ప్రభుత్వానికి రుణపడి ఉంటా.

– జి.వెంకట మహాలక్ష్మి, తేలప్రోలు

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..



గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అండగా నిలిచారు. సంక్షేమం అమలుతో ఆర్థికంగా ఆదుకుంటూ తోడ్పాటు అందించారు. పదవుల్లోనూ సగ భాగం మహిళలకు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. డ్వాక్రా రుణ మాఫీలోనూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.

– ఎ.జిన్నీ, మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలు, ఉంగుటూరు

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ సువర్ణరాజు, మహిళలు

రామవరప్పాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ ఆసరా నాలుగో విడత' కింద రూ 6,395 కోట్లు జమ చేసిన సందర్భంగా విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు సచివాలయం–3 వద్ద మంగళవారం వీవోలతో కలిసి జెడ్పీటీసీ సువర్ణరాజు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధులు రూ 6,394.84 కోట్లను సీఎం జగన్ విడుదల చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేసిందన్నారు. 56 నెలల పాలనలో 79 లక్షల మంది డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా కింద రూ 25,571 కోట్ల రుణాలను చెల్లించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధికి అధిక ప్రాముఖ్యత ఇస్తుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దూరు రత్నం, డ్వాక్రా సంఘాల మహిళలు, వీఓలు పాల్గొన్నారు.

బాలఏసు నవదిన ప్రార్థనలు ప్రారంభం



జ్యోతినగర్ చర్చిలో బాలఏసు జెండా ఆవిష్కరిస్తున్న ఫాదర్ థామస్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక గుడివాడరోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చిలో ఈ నెల 31వ తేదీ నుంచి నిర్వహించనున్న అద్భుత బాల ఏసు మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నుంచి నవదిన ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాల ఏసుకు ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఆర్సీఎం గన్నవరం విచారణకర్త ఫాదర్ పసాల థామస్ ముఖ్య అతిథిగా హాజరై చర్చి ప్రాంగణంలో బాలఏసు జెండాను ఆవిష్కరించారు. అనంతరం వైభవంగా దివ్య బలి పూజ సమర్పించారు. జేఎంజే సిస్టర్స్ ఆలపించిన బాలఏసు గీతాలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచాయి. జ్యోతినగర్ విచారణకర్త ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి, చర్చి కమిటీ సభ్యులు గుడిసె రాజు, అల్లాడి చంటి, దయాల సుందరరావు, పల్లంపాటి సుందరరావు, జీవరత్నం, కాంతారావు, పొట్ల సురేష్ పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: భార్య అదృశ్యంపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం చోడవరం రామాలయంలో అర్చకుడిగా పని చేస్తున్న వెంకట ధన్వంతరి సాయిభార్గవ్ గతేడాది నవంబర్ 22న బాపట్ల జిల్లా చినగంజాం గ్రామానికి చెందిన హరిచందనను వివాహం చేసుకున్నాడు. అయితే ఈ నెల 22న సాయిభార్గవ్ గుడిలో పూజలు ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా భార్య హరిచందన కనబడలేదు. దీంతో ఆమె కోసం బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె జాడ తెలియలేదు. సాయిభార్గవ్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

కుటుంబ గొడవలతో దాడి

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో కుటుంబ గొడవల కారణంగా పలువురు వ్యక్తులపై దాడి జరిగిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా మధిర మండలం మత్తూరు గ్రామానికి చెందిన గణేష్‌ను గత కొద్ది నెలల క్రితం పెనమలూరుకు చెందిన అంగిరేకుల రమణకుమారి వివాహం చేసుకుంది. ఆమె గర్భిణి కావటంతో పెనమలూరు పుట్టింటికి వచ్చింది. అయితే సోమవారం భర్త గణేష్, అత్త శ్రీదేవి పెనమలూరులోని రమణకుమారి వద్దకు వచ్చారు. కాగా రమణకుమారి బాబాయి కుమార్తె వనజ గత కొద్ది కాలం క్రితం రమణకుమారి బావను వివాహం చేసుకోగా గొడవల కారణంగా విడిపోయారు. కాగా రమణకుమారి వద్దకు ఆమె భర్త గణేష్, అత్త శ్రీదేవి వచ్చారని తెలుసుకున్న వనజ, పిన్ని లక్ష్మి, బంధువులు భవాని, నాగయ్య వచ్చి గొడవ పడ్డారు. వారు రమణకుమారిని, ఆమె భర్త గణేష్, బంధువు ప్రవీణ్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన రమణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళను దూషించిన ఇద్దరిపై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో మహిళను దూషించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కానూరు గుమ్మడితోటకు చెందిన బొగ్గవరపు దేవి ఇంటి వద్ద ఎవరో చెత్త కుప్ప వేశారు. దీంతో ఆమె ఈ విషయమై తన తల్లితో మాట్లాడుతున్న సమయంలో అక్కడకు సురేంద్ర, జగ్గారావు వచ్చి వారితో గొడవపడి దూషించారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు దాత తోట తేజ వీరసాయి, శాంతి(కానుమోలు) సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో అంతర్గత రహదారి అభివృద్ధి నిమిత్తం స్థానిక అధికారులు అంచనాలు రూపొందించి నిధులు మంజూరుకై ఉన్నతాధికారులకు నివేదించారు. గ్రామంలోని మైమార్ట్ సమీపంలో కనుమూరి మాన్‌సన్ నుంచి రామకృష్ణ ఎన్క్లేవ్ వరకు సీసీ రహదారి అభివృద్ధికి ఇటీవల కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును కలిసి స్పందనలో వినతి పత్రం సమర్పించారు. దీనికి స్పందించిన అధికారులు తగు చర్యలు ప్రారంభించారు. ఈ రహదారిని 154 మీటర్ల పొడవునా సిమెంట్ రహదారితో పాటు డ్రెయిన్ నిర్మాణానికి రూ.22 లక్షలతో అంచనాలు తయారు చేసి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి రహదారిని అభివృద్ధి చేయనున్నారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

హోరాహోరీగా సాగనున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు



గన్నవరంలో సిద్ధమైన వాలీబాల్ కోర్టు

గన్నవరం: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో బుధవారం నుంచి ఏడు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల పురుషులు, మహిళల జట్లు పాల్గొంటాయి. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ డబుల్స్, ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో క్రికెట్ పోటీలు జరగనున్నాయి. నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో విజేతగా నిలిచిన జట్లకు రూ.35 వేలు, రన్నర్ జట్లకు రూ.15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్లకు రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నారు. బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచిన జట్లకు రూ.20 వేలు, రన్నర్ జట్లకు రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్లకు రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ తెలిపారు. పోటీలను ప్రేక్షకులు తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు.

సహాయం చేయటంలోనే నిజమైన సంతోషం



ముస్లింలకు నగదు అందజేస్తున్న పడమట స్నిగ్ధ, సురేష్‌బాబు

కంకిపాడు: సహాయం చేయటంలోనే నిజమైన సంతోషం ఉందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్, రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. గోసాల వద్ద గల కబరిస్తాన్ అభివృద్ధి, మెరక పనులకు రక్ష ఫౌండేషన్ తరపున చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ మంగళవారం ముస్లిం పెద్దలకు తన తండ్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ మాజీ సమన్వయకర్త పడమట సురేష్‌బాబుతో కలిసి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తొలుత కబరిస్తాన్‌ను సందర్శించి కల్పించాల్సిన మౌలిక వసతులపై ముస్లిం పెద్దలతో సమీక్షించారు.

పేదల సంక్షేమానికి కృషి

ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ.. సామాజిక సేవ చేయటం ద్వారా సమాజ అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. తన తండ్రి సురేష్‌బాబు 2009 నుంచి పెనమలూరు నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహించి పేదల సంక్షేమానికి పాటుపడ్డారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మహమ్మద్ బేగ్, సయ్యద్ కాలేషా, సయ్యద్ అమీర్, షేక్ సుబాని, అజ్గర్ షరీఫ్, సయ్యద్ రఫీ, రజాక్ పాల్గొన్నారు.

అన్నసమారాధనకు రూ.1.78 లక్షల విరాళం



పెనమలూరులో విరాళం అందజేస్తున్న భక్తులు

పెనమలూరు: పెనమలూరులో ఆదివారం జరగనున్న అయ్యప్పస్వామి అన్నసమారాధనకు అమెరికాకు చెందిన ఎన్నారైలు మంగళవారం విరాళం అందజేశారు. గ్రామంలో గత 44 సంవత్సరాలుగా అయ్యప్పస్వామి అన్నసమారాధనను భక్తులు నిర్వహిస్తున్నారు. జనవరి 28వ తేదీన నిర్వహించనున్న అన్న సమారాధనకు అవసరమైన బియ్యానికి రూ.1,78,655ను ఎన్నారైలు పంపారు. ఈ మేరకు నిర్వాహకులకు నగదును ఎన్నారై ప్రతినిధులు మోర్ల నరేంద్రబాబు, కిలారు ప్రవీణ్, పాలడుగు సుధీర్ అందజేశారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు



సీడీపీఓ సుకన్యకు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనమలూరు: గత కొద్దికాలంగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం విధుల్లో చేరారు. సీడీపీఓ కె.సుకన్య వివరాలు తెలుపుతూ కంకిపాడు సెక్టార్ పరిధిలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో మొత్తం అంగన్‌వాడీ కార్యకర్తలు 215 మంది, హెల్పర్లు 203 మంది ఉన్నారన్నారు. సమ్మెలో అంగన్‌వాడీ కార్యకర్తలు 197 మంది, హెల్పర్లు 181 మంది పాల్గొన్నారని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లందరూ తమ సమ్మెను విరమించినట్లు ప్రకటించి జాయినింగ్ రిపోర్టులు ఇచ్చి విధుల్లో చేరారన్నారు. కంకిపాడు సెక్టార్ పరిధిలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయని చెప్పారు.

జగనన్న పాలనలో పల్లెల్లో ప్రగతి



జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ బాలస్వామి

ఉయ్యూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రగతి పథంలో పల్లెలు నడుస్తున్నాయని కలవపాముల సర్పంచ్ పానుగుమాటి బాలస్వామి అన్నారు. మండలంలోని కలవపాముల శివారు దూబ మాలపల్లిలో రూ.21.90 లక్షలు అంచనాతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులను మంగళవారం సర్పంచ్ బాలస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను రెండు కళ్లుగా భావించి అమలు చేస్తోందన్నారు. తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీటిని సరఫరా చేసే చర్యలు చేపట్టామన్నారు. నూతనంగా చేపట్టిన తాగునీటి సరఫరా పనులతో దూబ మాలపల్లిలో సురక్షిత తాగునీరు సమృద్ధిగా అందుతుందన్నారు. కలవపాముల గ్రామ ప్రజలు జగనన్నకు అండగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెత్త తొలగింపు



హైవేపై చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పూడిక తీత పనులు నిర్వహించారు. జాతీయ రహదారికి ఇరువైపులా చెత్త, వ్యర్థాలను తొలగించారు. ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతం, రామానగర్, మసీదు సెంటర్, నెహ్రూనగర్, బెస్ట్ ప్రైస్ సమీపంలో చెత్తను తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ.. మురుగు నీరు సజావుగా పారుదల కాకపోవడంతో గత కొన్ని రోజులుగా కాల్వల్లో పూడికతీత పనులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గ్రామంలో సురక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.